హలధారి కంట జలధార

- ఆరుగాలం శ్రమించినా ఫలితం ప్రశ్నార్థకమే
- ఫెంగల్ తుపాను ప్రభావంతో చేదు అనుభవం
- నీట మునిగిన పంట భూములు
- ధాన్యం కొనుగోలు అంతంత మాత్రమే


కోడూరుపాడులో వర్షానికి ముందు ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని సంచుల్లో పడుతున్న కూలీలు

అల్లవరం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి రావాలంటే రైతు నేడు ఎన్నో సవాళ్లను ఎదుర్కోవలసి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లు విరుచుకుపడితే కర్షకుడి కష్టం ఎవరూ తీర్చలేనిది. పండిన పంటను ఒబ్బిడి చేసుకోలేక, ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని అమ్ముకోలేక ఒకవేళ అమ్మినా సమయానికి ధాన్యం డబ్బులు రాక రైతుపడే కష్టం దయనీయమైనది. ముఖ్యంగా ఖరీఫ్‌లో వరిసాగు కత్తి మీద సాము లాటింది. వరినారు వేసిన నాటి నుంచి పంట చేతికి వచ్చేంత వరకు ఏదో రూపంలో రైతన్నలు నష్టపోతున్నారు. ఈ ఏడాది ఆరంభంలో రెండు పర్యాయాలు అధిక వర్షాల కారణంగా నారుమళ్లు కుళ్లిపోయి తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్‌లో పంట వేసిన రైతులకు ఫెంగల్ తుఫాన్ చేదు అనుభవాన్ని మిగిల్చింది. మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా వ్యవసాయ క్షేత్రాలు వర్షపు నీటితో మునిగాయి. ముంపు నీరు దిగితే గాని వరి పనులు ముందు సాగేలా లేవు.

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	పూర్తయిన వరికోతలు	కొనుగోలు కేంద్రాలు	కొనుగోళ్లు చేసిన ధాన్యం (క్వింటాళ్లో)
అల్లవరం	2,777	217	17	224
ఉప్పలగుప్తం	4481	1961	14	730
అమలాపురం రూరల్	4861	958	09	910

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వరి కోతలను చేపట్టిన గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు జరగక ధాన్యం రాశులు కళ్ళాల్లో దర్శనమిస్తోంది. వర్షానికి ముందే ఒబ్బిడి చేసినా తేమ పేరిట ధాన్యం కొనుగోళ్లు సాగలేదు. 17 శాతం కన్నా తక్కువ తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోళ్లు చేసేందుకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చారు. యంత్రాల సహాయంతో నూర్పిడి చేసిన ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందని ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్లక్ష్యం చేశారు. దీంతో 17 శాతం కన్నా ఎక్కువ తేమ ఉన్న ధాన్యం కొనుగోళ్లకు నోచుకోలేదు. సోమవారం నుంచి వాతావరణం కాస్త పొడిగా మారడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కళ్ళాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లర్లకు తరలించే చర్యలు చేపట్టారు. అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్‌లో 12,119 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా ఇప్పటి వరకు కేవలం 3,136 ఎకరాల్లో మాత్రమే కోతలు జరిగాయి. కేవలం 1,864 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇంకా వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్ళాల్లో ఉంది.


దేవగుప్తంలో వర్షానికి తడిసిన వరికుప్ప


కిత్తనచెరువులో కొనుగోళ్లు లేక బరకాలు కప్పి ఉంచిన ధాన్యం

ధాన్యం అమ్మకాలు లేవు



కోడూరుపాడులో 2.5 ఎకరాల్లో ఖరీఫ్‌లో 1318 వరి రకాన్ని సాగుచేశాను. తుఫాన్‌కు ముందు కోత కోసి ఒబ్బిడి చేసుకున్నాం. ఈ లోగా తుఫాన్ రావడంతో ధాన్యం అమ్మకాలు సాగలేదు. ఐదు రోజులుగా ధాన్యం రాశులు నిల్వ ఉండిపోయాయి. ఈ రోజు వాతావరణం కాస్త పొడిగా ఉండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా మిల్లుకు తరిస్తున్నాను.

పప్పుల సూర్యనారాయణ,
కోడూరుపాడు, అల్లవరం.

నీరుగారిన ఆశలు

ముమ్మిడివరం: ఫెంగల్ తుఫాన్ అన్నదాతను అతలాకుతలం చేసింది. ఖరీఫ్ సాగు ఆది నుంచి భారీ వర్షాలు, తెగుళ్లతో తీవ్ర నష్టానికి గురి కాగా మిగిలి ఉన్న వరి పంటను ఫెంగల్ తుఫాను గల్లంతు చేస్తోంది. కోతకు వచ్చిన వరి చేలన్నీ నేల కొరిగాయి. చేలల్లో నీరుచేరి వరి కంకులు నీట మునిగాయి. దీంతో చేతికి వచ్చిన ధాన్యం గింజలు నేలపాలయ్యాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అధిక పెట్టుబడులు పెట్టి పంట దక్కుతుందనే తరుణంలో ప్రకృతి మళ్లీ విరుచుకు పడిందని వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోకపోతే అప్పులు ఇచ్చేవారే ఉండరని దాళ్వాసాగుకు ముందుకు సాగలేమని రైతులు అంటున్నారు. నియోజవకర్గంలో సుమారు 30 శాతం కూడా కోతలు పూర్తవ్వలేదని మిగిలిన చేలు నీట మునిగాయని ఆవేదన చెందుతున్నారు. కోత కోసిన ధాన్యం ఎక్కడికక్కడే కళ్లాల్లో ఉందని వర్షాలు తెరిపిస్తే వాటిని ఒబ్బిడి చేసుకొనే వీలుంటుందని రైతులు తెలిపారు. ఇప్పటికే కొంత మంది రైతులు తుఫాన్ కారణంగా తమ చేలల్లో కోతలను వాయిదా వేసుకున్నారు. కోతలు కోసిన రైతులు వాతావరణం తెరిపిస్తే మాసూలు చేసుకుని ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటామని చెబుతున్నారు.


ముమ్మిడివరంలో కోత కోసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

క్లుప్తంగా

వైభవంగా అన్నాభిషేకం, రుద్రహోమం


రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

అమలాపురం టౌన్: స్థానిక గోల్డ్ మార్కెట్‌లో కుళాయి మంచినీటి చెరువు వద్ద గల శ్రీమహాగణపతి ఆలయంలో కార్తికమాస రుద్రాభిషేక దీక్ష విరమణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరస్వామికి అన్నాభిషేకం, రుద్రహోమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు రామేశ్వరపు మణికంఠశర్మ ఆధ్వర్యంలో పూజా క్రతువులు జరిగాయి. ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్‌గౌడ్ పర్యవేక్షించారు. ఆర్ఎస్ఎస్ నాయకులు బొలుసు జగదీష్, పులిమే రాజా తదితరులు పాల్గొన్నారు. ఆలయం వద్ద జరిగిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

పేదలకు వస్త్రదానం

అమలాపురం టౌన్: స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో పట్టణంలో రోడ్ల చెంత ఉండే అనాథలు, యాచకులకు సోమవారం అన్నదానం, వస్త్రదానం చేశారు. దాదాపు 120 మందికి యోగాశ్రమం ఈ వితరణ కార్యక్రమాలు చేపట్టింది. యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆశ్రమ శిక్షకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగాశ్రమ ప్రతినిధులు తురగా సాయి, చిలుకూరి వివేక, దుర్గ తదితరులు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

గురుకులం క్రీడాకారుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న గురుకులం ఉపాధ్యాయుల బృందం

అల్లవరం: నవంబర్ 28 నుంచి 30 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గోడి బాలురు గురుకులానికి చెందిన క్రీడాకారులు రాణించారని ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. పదో తరగతికి చెందిన సీహెచ్ క్రాంతికుమార్, ఇంటర్‌కు చెందిన సతీష్‌కుమార్‌లు జావెలిన్‌త్రో లో ద్వితీయ స్థానం, డిస్కస్‌త్రో లో తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను గురుకులం ఉపాధ్యాయుల బృందం శుభాకాంక్షలు తెలిపింది. క్రీడాకారుల విజయంలో కీలకపాత్ర పోషించిన పీడీ నానిబాబు, పీఈటీ వై సుబ్రహ్మణ్యంలను అభినందించారు.

ఫ్లోర్ కర్లింగ్ క్రీడలో విద్యార్థులకు పతకాలు

అమలాపురం టౌన్: కాకినాడలో ఆదివారం జరిగిన 5వ ఏపీ ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక సర్ సీవీ రామన్ స్కూలుకు చెందిన అయిదుగురు విద్యార్థులు పలు పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో వీరు ప్రతిభ చాటారు. స్కూలు విద్యార్థులు వై.శ్రీకర్, ఈ.కార్తీక్, జి.యశ్వంత్, సీహెచ్ శ్రీనివాస్, ఆర్ హరిరాజులు పలు పతకాలు సాధించారు. విజేతలైన విద్యార్థులను సర్ సీవీ రామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ ఎన్ శ్రీనివాస్ అభినందించారు.

వాకింగ్ ట్రాక్ పరిశీలన

ముమ్మిడివరం: ముమ్మిడివరం పట్టణ ప్రజలకు అవసరమైన పోలమ్మ చెరువుగట్టు వాకింగ్ ట్రాక్‌ను ఆధునీకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. సోమవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మ, టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ పునర్నిర్మించి దేశ నాయకులు ఉన్న ప్రదేశాన్ని సుందరంగా తీర్చి దిద్దాలని పలువురు నాయకులు ఎమ్మెల్యేకి సూచించారు. నిరుపయోగంగా ఉన్న జిమ్‌ను వాకింగ్ ట్రాక్ వద్ద ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు.

అయ్యప్ప పీఠానికి విరాళం

యానాం: అయ్యప్ప స్వామి పీఠం పూజల నిర్వహణకు రూ.50 వేల విరాళాన్ని సోమవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అందజేశారు. వాసిరెడ్డి సుబ్బారావు స్వామి పీఠానికి ఈ విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్బతి లోకేశ్వరరావు, సాధనాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రజకులపై దాడులు అమానుషం

అమలాపురం రూరల్: మలికిపురం మండలం గూడపల్లి గ్రామంలో గుబ్బాపాలేనికి చెందిన రామేశ్వరపు జై సాయి యువరాజ్ అనే రజక యువకుడిపై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేయాలని జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో కోనసీమ కలెక్టరేట్ వద్ద సోమవారం ఆ సంఘీయులు నిరసన తెలిపారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు ప్రధాన సూత్రధారిని పట్టుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో తమ సామాజికవర్గానికి చెందిన వారిపై దాడులు జరగటం దారుణమన్నారు. కలెక్టర్, జిల్లా ఎస్పీలకు ఫిర్యాదు చేశారు.

హైందవ శంఖారావం విజయవంతానికి పిలుపు

అమలాపురం టౌన్: జనవరి 5న విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హైందవ శంఖారావానికి మాతాజీలు, స్వామీజీలు, హిందూ సమాజ ప్రతినిధులు విధిగా హాజరై విజయవంతం చేయాలని జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. సుబ్రహ్మణ్యంతో పాటు భజరంగదళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు తదితరుల బృందం కోనసీమలోని పలువురు మాతాజీలు, స్వామీజీలకు హైందవ శంఖారావం ఆహ్వాన పత్రికలు అందించి వారి రాకను కోరింది. అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లిలో ఉన్న ఇద్దరు మాతాజీలకు ఆహ్వాన పత్రికలు అందించారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో ఉన్న ప్రసాద్‌రాజు స్వామీజీ, అంబాజీపేట మండలం ముక్కామల గ్రామంలో ఉన్న వాసు దేవానంద్ భారతీ స్వామీజీలకు ఆహ్వాన పత్రికలు అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సత్యనారాయణ, పులిశెట్టి గంగాధర్, జిల్లా గోరక్ష కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


నల్లమిల్లిలో మాతాజీలకు ఆహ్వాన పత్రికలను అందిస్తున్న వీహెచ్‌పీ, భజరంగదళ్ ప్రతినిధులు

తుపాను నష్టంపై కేంద్రానికి నివేదిక

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఫెంగల్ తుఫాన్ మిగిల్చిన నష్టాన్ని అంచనా వేసి సాయం కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు సీఎం రంగసామి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుపాను కారణంగా అమిత వేగంతో వీచిన గాలులు, వర్షాలతో వేలాది కోట్ల నష్టం జరిగిందన్నారు. పుదుచ్చేరిలో ముంపు ప్రాంతాల్లో ఎల్జీ కె కైలాష్‌నాథన్ పర్యటించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్టేట్ ఎమర్జెన్సీ అసిస్టెంట్ సెంటర్, ముంపునకు గురైన సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఫెంగల్ తుపాను పుదుచ్చేరిని అతలాకుతలం చేసి నష్టాన్ని మిగిల్చిన నేపథ్యంలో సహాయంపై లోక్‌సభలో చర్చించడానికి లోక్‌సభ స్పీకర్, సెక్రటరీ జనరల్‌కు అడ్జార్న్‌మెంట్ మోషన్ నోటీసును అందించినట్లు ఎంపి వి వైథిలింగం తెలిపారు.


తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న రంగసామి

తడిచిన ధాన్యంపై ఉప్పు ద్రావణం జల్లాలి


చినగాడవిల్లిలో నీట మునిగిన వరిచేనును పరిశీలిస్తున్న అధికారులు

ఉప్పలగుప్తం: వర్షానికి తడిచిన, నీట మునిగిన ధాన్యంపై లీటరు నీటికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసి గింజ మొలకెత్తకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు రైతులకు సూచించారు. చినగాడవిల్లి గ్రామంలో ఫెంగల్ తుఫాన్ కారణంగా నీట మునిగిన వరి పొలాలను ఏరువాక పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డా.నందకిషోర్‌తో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఉప్పలగుప్తం మండలంలో 4,481 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టగా 1961 ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు, 383 ఎకరాల్లో వరిపంట నీట మునిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఏవో తెలిపారు.

శాయ్‌లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి

యానాం: పట్టణ పరిధిలోని స్థానిక వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో ఉన్న ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) కేంద్రంలో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన సాయ్ క్రీడా శిక్షణా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. మౌలిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి అవకాశం ఉండటం లేదని శాయ్ ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ జి కిషోర్ మల్లాడి దృష్టికి తీసుకెళ్లారు. సదుపాయాలు కల్పిస్తే స్విమ్మింగ్‌తో పాటు వాలీబాల్, అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చి క్రీడాకారులను తీర్చిదిద్దుతామని తెలిపారు. దీనికి స్పందించిన మల్లాడి కృష్ణారావు శాయ్‌కు పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని శిక్షణ పొందుతున్న క్రీడాకారులను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని శాయ్ ప్రతినిధులను కోరారు.


శాయ్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్న మల్లాడి, ఆర్ఏఓ మునిస్వామి

కవి సమ్మేళనంలో అలరించిన కవితా గానం

అమలాపురం టౌన్: అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో అమలాపురానికి చెందిన కవి బీవీవీ సత్యనారాయణ కవితా గానం వినిపించారు. 'పంజరంలో శాంతి కపోతం' అనే శీర్షికన కవితా గానం చేసి ఆహూతులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కవి బీవీవీని అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు బెల్లంకొండ విజయలక్ష్మి తదితరులు ఘనంగా సత్కరించారు. శతాధిక కవి సమ్మేళనానికి హాజరైన ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవుల చేత కవితా గానాలు చేయించే ఆవృతం బాధ్యతను కవి బీవీవీ నిర్వహించారు. ఈ సమ్మేళనంలో అమలాపురానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు, జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కవయిత్రి పోలిశెట్టి అనంతలక్ష్మి, ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర, జిల్లా నాయకులు యెందూరి రాఘవ, యెండూరి సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొని కవి బీవీవీని అభినందించారు.


కవి బీవీవీని సత్కరిస్తున్న అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ ప్రతినిధులు

పారాలీగల్ వలంటీర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పారా లీగల్ వలంటీర్ల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ తెలిపారు. పారా లీగల్ వలంటీర్ల కోసం దరఖాస్తు చేయడానికి పదో తరగతి అర్హత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. మౌఖిక ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక జరుగుతుందని వివరించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, అంగన్‌వాడీ వర్కర్లు, డాక్టర్లు తదితర విభాగాలకు చెందిన వారంతా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వీరేశ్వరస్వామి దేవస్థాన ఆదాయం రూ.50.43లక్షలు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థాన ఆదాయం ఈ ఏడాది కార్తిక మాసంలో గత ఏడాది కంటే గణనీయంగా పెరిగిందని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. టెంపుల్ టూరిజం ప్యాకేజీలో రాష్ట్ర వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని అన్నారు. ఆలయ అర్చక, పురోహిత, కార్యాలయ సిబ్బంది విశేష సేవలు అందించారన్నారు. వీరేశ్వర స్వామి అన్నదాన ట్రస్ట్‌కి దాతలు భారీగా విరాళాలు సమర్పించారన్నారు. ఈ ఏడాది దేవస్థానానికి అన్ని విభాగాల నుంచి మొత్తంగా రూ.50 లక్షల పైచిలుకు ఆదాయం వచ్చినట్టు కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ ఏడాది కార్తికమాసం పూర్తయిందని సహకరించిన భక్తులు, సేవలందించిన పలు శాఖల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రానందంగా జ్యోతిర్లింగార్చన

తాళ్లరేవు: కార్తికమాస అమావాస్య సందర్భంగా పాతకోరంగిలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి జ్యోతిర్లింగార్చన వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సహకారంతో జ్యోతిర్లింగార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్తిక దీపాలతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ఈ సందర్భంగా కార్తిక మాసంలో విశేష సేవలందించిన వారిని సాయిప్రసాద్ సత్కరించారు.


జ్యోతిర్లింగార్చనలో పాల్గొన్న భక్తులు

పాస్టర్ల ఫ్యామిలీ క్రిస్మస్

యానాం: యానాం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యాపారవేత్త తోటరాజు, ఎమ్మెస్సార్ సంస్థ అధినేత, ఐ పోలవరం జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్థానిక ఫెర్రీరోడ్డులో గల సమస్త జనుల ప్రార్థనా మందిరంలో అసోషియేషన్ అధ్యక్షుడు డేవిడ్ సమక్షంలో నిర్వహించారు. పాస్టర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ జోసఫ్, వంగలపూడి విజయకుమార్, పిడి ప్రసాద్, కర్రి రాజు, సమర్పణరావు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో మెరిసిన విద్యార్థులు

ఐ.పోలవరం: ఈ నెల 28 నుంచి 30 వరకు కాకినాడ క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -17 బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ జట్టులో ఐ.పోలవరం మండలం జి వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు క్రీడాకారులు పాల్గొనగా లంకలపల్లి చిన్నతల్లి, బొమ్మిడి పూర్ణిమ వెంకటదుర్గలు జాతీయ జట్టుకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు సలాది వెంకట్ నారాయణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మహారాష్ట్ర జలగాంలో జరిగే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

గృహ నిర్మాణం అడ్డగింత

తాళ్లరేవు: మండల పరిధిలోని గోవలంక పంచాయతీలో సర్వే నెంబరు 52-4లో నిర్మిస్తున్న గృహ నిర్మాణాన్ని సోమవారం అధికారులు అడ్డుకున్నారు. ఆ నిర్మాణం తొలగింపునకు అధికారులు యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే గోవలంక పంచాయతీకి చెందిన సుమారు 16 సెంట్ల స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారంటూ స్థానిక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ ఇటీవల జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ సున్న శంకరనారాయణ, పంచాయతీ కార్యదర్శులు రమణ, శ్రీనివాసరావు, స్థానిక పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్‌లతో పాటు పోలీసుల సహాయంతో తొలగింపు చేపట్టారు. 50 ఏళ్ల నుంచి ఇదే స్థలంలో నివాసముంటున్నామని, పూరి పాకను తొలగించి పక్కా ఇల్లు నిర్మించుకుంటుంటే కావాలనే కొందరు తమకు అడ్డు తగులుతున్నారని బాధితులు కొట్నాల దేవానంద్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు గతంలో పట్టాలు ఇచ్చారని వారు తెలిపారు. పాక స్థానంలో ఇల్లు నిర్మించుకునే సమయంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి అర్జీ పెట్టుకుని ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. దీనిపై కోర్టు కేసు నడుస్తుందని, ఎనిమిది వారాలపాటు ఎటువంటి చర్యలు చేపట్టరాదని కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని చెప్పడంతో అధికారులు వెనుతిరిగారు.

దారి చూపండి

అమలాపురం రూరల్: తమ ఇంటికి వెళ్లే రహదారి మార్గాన్ని కొందరు కొనుగోలు చేసి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం బాధితులు ధర్నా నిర్వహించారు. అమలాపురం పట్టణం 17వ వార్డు వడ్డిగూడెం ప్రాంతంలో 450/3, 447/1 సర్వే నెంబర్లలో దాదాపు 20 కుటుంబాల వారు నివాసం ఉంటున్నామని తామంతా ఇళ్లకు వెళ్లే స్థలాన్ని పెనమత్స సత్యనారాయణ రాజు కొనుగోలు చేశానంటూ రోడ్డు మార్గంలో షెడ్డు నిర్మించుకున్నారని తెలిపారు. తమకు దారిలేకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. తమకు దారి సౌకర్యం కల్పించాలని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక

యానాం: తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఈ నెల 13,14 తేదీల్లో నిర్వహించే జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు యానాం నియోజకవర్గ పరిధిలో తీరప్రాంత గ్రామం సావిత్రి నగర్‌కు చెందిన బాడీబిల్డర్ సంగాడి రమేష్ ఎంపికయ్యారు. సోమవారం జాతీయబాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ నిర్వాహకుల నుంచి లేఖ అందినట్లు రమేష్ విలేకరులకు తెలిపారు. సౌత్ ఇండియా నుంచి తాను ప్రాతినిధ్యం వహించడం ఆనందంగా ఉందన్నారు.

వెంకన్న ఆలయంలో వేలం పాటలు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రాజ రాజేశ్వరి కల్యాణ మండపం, కళావేదిక, పెళ్లి మండపాల నిర్వహణకు దేవదాయ శాఖ అధికారులు టెండర్లు, బహిరంగ వేలం పాటలను సోమవారం నిర్వహించారు. ఈ టెండర్లు, వేలం పాటల్లో పాల్గొన్న కాంట్రాక్టర్లు నిబంధనలకు లోబడి హక్కుల కోసం టెండర్లు వేశారు. వేలం పాడారు. దేవస్థానం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరీ కల్యాణ మండపానికి రూ.6.53 లక్షలు, దేవస్థానం ప్రాంగణంలో పెళ్లి మండపాల ఏర్పాటు హక్కుల కోసం రూ.7.65 లక్షలు, కళావేదిక కోసం రూ.7.35 లక్షలు చొప్పున సంబంధిత కాంట్రాక్టర్లు వేలం పాడుకొని హక్కులు పొందారని దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ వేలం పాటలు, టెండర్లను గ్రూపు దేవాలయాల ఈవో కె.కార్తీక పర్యవేక్షించి హెచ్చు వేలం పాటలను ఖరారు చేశారు.

మాలల ఆత్మీయ సమ్మేళనం

అల్లవరం: బోడసకుర్రు కంసాలమామిడిలో అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆలోచనా విధానం, పీవీరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లిన నాడు మాలల హక్కులను సాధించుకోగలమని అశోక్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో మోసుగంటి దుర్గారావు, మాజీ సర్పంచ్ సాపే ధర్మరాజు, జల్లి శ్రీనివాసరావు, అంబటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన నిధికి విరాళం

అమలాపురం రూరల్: మండలంలో పాత బండారులంక గ్రామంలో వేంచేసి యున్న భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన శాశ్వత నిధికి పడవల పూర్ణచంద్ర మౌళి, నాగ సూర్యకుమారి దంపతులు విరాళం అందించారు. రూ. 25 వేల నగదును అన్నదాన నిధికి అందజేసి భక్తి భావాన్ని చాటుకున్నారు. నగదును శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తికి అందజేశారు. దాతలను ఆలయ పురోహితులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో పిచ్చిక కోటేశ్వరరావు, చింతా ఉమా తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన నిధికి విరాళం అందిస్తున్న పూర్ణచంద్ర దంపతులు

16న ఐక్యగ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

యానాం: యానాం ఐక్యగ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ దొమ్మేటి సామ్యూల్‌సాగర్ సోమవారం తెలిపారు. న్యూ బస్టాండ్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, మిరాకిల్ సెంటర్ వైజాగ్ అంతర్జాతీయ ప్రసంగికులు శామ్యూల్ కర్మోజీ, గౌరవ అతిథిగా క్రీమ్‌సేవా సంస్థ డైరెక్టర్ రెవరెండ్ దొమ్మేటి వసంతరావు, డేవిడ్ హాజరు కానున్నారని తెలిపారు.